## క్లుప్తంగా

### మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల

శింగనమల: నియోజకవర్గ సమీక్ష సమావేశానికి సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఏపీ నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రమీల మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ నాటకరంగ అకాడమీకి చైర్‌పర్సన్‌గా నియమించడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నారు.

### వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



ఆదిలక్ష్మి (ఫైల్)

పెద్దవడుగూరు: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన గోవిందు, ఆదిలక్ష్మి (36) దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా గోవిందు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని ఆదిలక్ష్మిని వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మనస్తాపం చెందిన ఆదిలక్ష్మి వారం రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపూరిత ద్రావకం తాగింది. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆమె ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఘటనకు సంబంధించి మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

### మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈశ్వరయ్య మృతి



గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఎస్.ఈశ్వరయ్య (61) సోమవారం రాత్రి మరణించారు. 20 రోజుల క్రితం అనారోగ్యంతో మెడికల్ లీవ్‌లో వెళ్లిన ఆయన చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. గతంలో అహుడాలో ఈఈగా పని చేస్తూ బదిలీపై గుంతకల్లుకు వచ్చిన ఈశ్వరయ్య ఈ యేడాది జూన్ 5న బాధ్యతలు చేపట్టారు.

**సంతాపం తెలిపిన ఎమ్మెల్యే, చైర్‌పర్సన్**

ఎంఈ ఈశ్వరయ్య గుంతకల్లు మున్సిపాలిటీకి చిరస్మరణీయ సేవలు అందించారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ మల్లికార్జున వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆయన మృతి తీరనిలోటన్నారు. ఈశ్వరయ్య మృతికి మున్సిపల్ కార్యాలయ, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

# టీడీపీని నమ్మి మోసపోవద్దు

- జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వైవీఆర్



పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ఇంటింటికీ తిరుగుతున్న టీడీపీ నేతల మాయమాటలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న 24వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ ఇంటింటికీ వెళ్లి గడిచిన నాలుగేళ్ల పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. సంక్షేమ రథసారథి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డితోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని పేర్కొన్నారు. జగనన్నకు చల్లని దీవెనలందించాలని ప్రజలను కోరారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నే మా నమ్మకమని ప్రజలే విశ్వసించేలా పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు సంతోషంగా ఉన్నారనడానికి వారి నుంచి లభిస్తున్న ఆదరాభిమానాలే నిదర్శనమన్నారు. అనంతరం వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న షబానా భర్త వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే వైవీఆర్ రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే నాలుగు నెలలుగా వేతనమందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయిన మున్సిపల్ స్కూల్ పార్ట్‌టైమ్ స్వీపర్ హనుమక్కకు రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కమీషనర్ మల్లికార్జున, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజినేయులు, కౌన్సిలర్లు కెవి.నాగరత్నమ్మ, చాముండేశ్వరి, లింగన్న, సుధాకర్, చాంద్‌బాష, సీనియర్ నాయకులు సిబి.జానకి రామిరెడ్డి, ముష్టూరు భాస్కర్, జమీల్, ఎద్దుల శంకర్, మల్లికార్జునశాస్త్రీ, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నియామక ఉత్తర్వుల అందజేత

గుత్తి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు ఎంపికైన వారికి సోమవారం నియామక ఉత్తర్వులు అందజేసినట్లు సీడీపీఓ డిల్లీశ్వరి తెలిపారు. గుంతకల్లు మండలం నరసాపురం అంగన్‌వాడీ కార్యకర్తగా హుస్సేన్‌బీ, గుత్తి మండలం జక్కల చెరువు ఆర్ఎస్ అంగన్‌వాడీ కేంద్రం ఆయాగా రసూల్‌బీ, పామిడి కాల్వగడ్డ ఏరియా అంగన్‌వాడీ ఆయాగా కౌసర్, గుంతకల్లు మిల్లు ఏరియాకు నాగవేణి, గుత్తి ఈద్గా ఏరియాకు హుస్సేన్‌బీ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

### ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లలో సోమవారం ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కూడేరు మండలం మరుట్ల-2 కాలనీకి చెందిన ఎర్రిస్వామి, నాగమ్మ దంపతుల కుమార్తె మీనాక్షి (35)ని పెనకచెర్లకు చెందిన వేణుగోపాల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. భర్త వేధింపులతో మీనాక్షి ఉరి వేసుకుని మృతి చెందింది. భర్త వేధింపుల వల్లే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అస్రార్ బాషా, ఎస్ఐ సాగర్ తెలిపారు.

### వివాహానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. పదేళ్ల క్రితం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, రాజ్యలక్ష్మి అనే రైతు దంపతులు మృతి చెందడంతో వారి ఐదుగురు సంతానం అనాథలయ్యారు. ఆ చిన్నారులు వారి పెద్దనాన్న శివారెడ్డి, పెద్దమ్మ లక్ష్మీదేవి సంరక్షణలో ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె అయిన స్రవంతికి వివాహం నిశ్చయమైంది. రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి రూ.20 వేలు, ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి రూ.20 వేలు, చాలవేముల సాయినాథ్‌రెడ్డి రూ.10 వేలు, శ్రీరామిరెడ్డి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.




## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

గుంతకల్లు: రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జీఆర్పీ సీఐ నగేష్ తెలిపారు. వివరాలను స్థానిక రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. రైళ్లల్లో దొంగతనాలు అరికట్టేందుకు జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరీ ఆదేశాల మేరకు వివిధ రకాల భద్రత చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కమ్యూనిటీ ఆధారిత చర్యల్లో భాగంగా రైల్వే స్టేషన్ సమీపంలో నిలిపే ఆటో డ్రైవర్ల సాయంతో సోమవారం ఉదయం ఓ యువకుడిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. విచారణలో రైళ్లలో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడే వాడిగా తేలింది. పట్టుబడిన యువకుడిని కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడికి చెందిన బోయ సురేష్‌గా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడిన సురేష్ రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల వద్ద నుంచి విలువైన సామగ్రి, బంగారు నగలు అపహరించుకెళ్లేవాడు. గుంతకల్లు జీఆర్పీ పరిధిలోనే నిందితుడిపై ఇప్పటికే ఐదు కేసులు ఉన్నాయి. సురేష్ నుంచి 4 తులాల బంగారు నగలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఆటో డ్రైవర్లకు రివార్డు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌ను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

యాడికి: నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని వెంకట్ ఫర్టిలైజర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రూ.50 వేలు విలువైన యూరియా అమ్మకాలు నిలిపేశారు. అలాగే మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేయడానికి వెళ్లగా అప్పటిదాకా తెరిచి ఉన్న దుకాణాన్ని నిర్వాహకులు మూసేశారు. దీంతో రెవెన్యూ అధికారుల సమక్షంలో షాప్‌ను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఏఓ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జయలక్ష్మీ ట్రేడర్స్, ఉమామహేశ్వర ఫర్టిలైజర్స్‌ను అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు తనిఖీ చేశారు. అక్రమంగా ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులకు, ఎరువులకు వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తించి, హెచ్చరికలు జారీ చేశారు. ఏఓ మల్లీశ్వరి, అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ పాల్గొన్నారు.




## హత్య కేసులో పలువురిపై కేసు నమోదు

తాడిపత్రి: పట్టణ పరిధిలోని నందలపాడులో ఆదివారం రాత్రి కొందరు యువకులు కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో ఆకుల సురేంద్ర అనే యువకుడు మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఆకుల కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు 11 మంది నిందితులుగా గుర్తించి వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులో ప్రధాన నిందితుడు చాకలి నరేంద్ర, చాకలి పవన్ కుమార్‌ల గ్రూపుల మధ్య గతం నుంచే విభేధాలు ఉన్నాయి. జగన్, మృతుడు ఆకుల సురేంద్రలు పవన్ కుమార్ గ్రూపుకు చెందిన వారు. ఆదివారం రాత్రి పీర్ల పండుగ అనంతరం ఏర్పాటు చేసిన ఓ భోజన కార్యక్రమంలో మద్యం తాగిన వీరు జగన్‌తో వాగ్వాదానికి దిగారు. అతడు సంఘటన స్థలం నుండి తప్పించుకుని పారిపోవడంతో చేతికి చిక్కిన ఆకుల సురేంద్రను, చాకలి నరేంద్ర, మద్దిరాల విజయ్ కుమార్, చాకలి ఆనంద్, తలారి శివప్రసాద్, సుమాకాంత్, మహబూబ్ బాషా, చాకలి నాగార్జున, ముస్తఫా, చాకలి కమలాకర్, షేక్ హాజీ అలీ, చాకలి శివతో పాటు మరి కొందరు కర్రలు, రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### ప్రమాదాల నివారణ ఉద్యోగి బాధ్యత



వర్చువల్ మీటింగ్‌లో పాల్గొన్న జోనల్‌లోని డీఆర్‌ఎంలు

గుంతకల్లు: ప్రమాదాల నివారణ ప్రతి ఉద్యోగి బాధ్యత అని డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ సూచించారు. సోమవారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో మ్యాన్ ఆఫ్ ది మంత్ భద్రత అవార్డుల ప్రదానోత్సవం వర్చువల్ పద్ధతి (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా నిర్వహించారు. జోనల్‌లోని వివిధ డివిజన్‌లకు చెందిన దాదాపు 37 మంది ఉద్యోగులు మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను దక్కించుకున్నారు. గుంతకల్లు డివిజన్‌కు చెందిన దాదాపు 11 మంది ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. అదేవిధంగా రైళ్ల రాకపోకల సమయపాలన గణాంకాలు, ట్రాఫిక్ బ్లాక్‌లు, రైల్వే ఆస్తుల వైఫల్యాల నిర్వహణ, 2023-24 సంవత్సరానికి భద్రతా కార్యచరణ ప్రణాళికపై వర్చువల్ మీటింగ్‌లో చర్చించడం జరిగిందన్నారు.




## 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత




రేషన్ బియ్యాన్ని సీఎస్‌డీటీ సూర్యనారాయణకు అప్పగిస్తున్న విజిలెన్స్ అధికారులు

యాడికి: మండల కేంద్రంలో పిన్నేపల్లె రహదారిలోని ఓ రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. వివరాలు.. చెన్నకేశవ స్వామి మాన్యం దగ్గర ఉన్న పిచ్చుకుంట్ల బ్రహ్మయ్యకు చెందిన రేకుల షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లింది. విజిలెన్స్ ఎస్ఐ ఫణీంద్రనాథరెడ్డి ఐటీసీ వెంకటరమణ, ఏఈఈ రవీంద్రనాథ, యాడికి సివిల్ సప్లయ్ డిప్యూటి తహసీల్దార్ సూర్యనారాయణతో కలసి దాడి చేశారు. 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. రాయలచెరువులో గల సివిల్ సప్లయ్ గోదాముకు తరలించారు. బియ్యం నిల్వ ఉంచిన రఘురాములు కుమారుడు కొప్ప చైతన్యపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

### కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి గ్రామంలో కుటుంబ సమస్యలతో రమేష్ (40) పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. లచ్చానుపల్లికి చెందిన రమేష్ 15 సంవత్సరాల క్రితం బసినేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. బసినేపల్లిలో ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రమేష్ తాగుడుకు బానిసకావడంతో రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చే వాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లాడు. అక్కడ అతిగా మద్యం సేవించి ఇంట్లో భార్య, కుటుంబ సభ్యులు మందలిస్తారని పురుగుల మందు సేవించి రాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాడు. సోమవారం వేకువజామున రమేష్ నోటి నుంచి తెల్లని నురుగ వస్తుండటాన్ని గమనించిన భార్య లక్ష్మి వెంటనే కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రమేష్ షర్టు జేబులో చూడగా కర్నూలు జిల్లా తుగ్గలిలో పురుగుల మందు కొన్నట్లు రసీదు లభించింది.




### దేవుని ఉప్పలపాడు సర్పంచ్‌గా కాటమయ్య



పెద్దపప్పూరు: సర్పంచ్ కాటమయ్యకు డిక్లరేషన్ అందజేస్తున్న అధికారులు

పెద్దపప్పూరు: మండల పరిధిలోని దేవుని ఉప్పల పాడు సర్పంచ్‌గా అదే గ్రామానికి చెందిన కాటమయ్య, చిన్న ఎక్కలూరు గ్రామానికి చెందిన సత్యం రెడ్డి 8వ వార్డు సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిలాన్ బాషా తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వారికి డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. సర్పంచ్‌గా ఎన్నికైన కాటమయ్య, వార్డు సభ్యుడిగా ఎన్నికైన సత్యంరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రెటరీ రవి ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డిపల్లి నాగరాజు, తురకపల్లి లక్ష్మిరెడ్డి, శివారెడ్డి తదితరులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

**వార్డు మెంబర్లుగా పలువురు ఏకగ్రీవం**

యాడికి: మండలంలోని నగరూరు 1వ వార్డు సభ్యునిగా వెన్నపూస విజయ్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు. సోమవారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణలో నగరూరు 1వ వార్డుకు బరిలో నిలిచిన నాగేశ్వర రెడ్డి నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దాంతో విజయ్‌కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. వెంగన్నపల్లెలో 5వ వార్డుకు బరిలో నిలిచిన అఖిల, మధుసూదన్ రెడ్డి ఇద్దరూ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవడంతో గ్రామానికి వార్డు పదవి ఖాళీ ఏర్పడినదని అధికారులు తెలిపారు. యాడికి 19వ వార్డుకు బరిలో నలిచిన బాలనాగమ్మ, మురళి నామినేషన్‌లు ఉపసంహరించుకున్నారు. రాయలచెరువు12వ వార్డుకు మొక్కల రేవతి, మొక్కల లక్ష్మిదేవి బరిలో నిలిచారు. యాడికి 19వ వార్డుకు పోటీలో ఉన్న శ్రీరాములు, శివకేశవకు ఎన్నికల అధికారులు గౌను, ప్రెషర్ కుక్కర్ గుర్తులు కేటాయించారు.

తాడిపత్రి: దిగువపల్లి గ్రామ పంచాయతీలోని 9వ వార్డు సభ్యుడిగా ఎద్దుల రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఆర్‌ఓ వాసుదేవరెడ్డి తెలిపారు.

గుత్తి రూరల్: పెద్దొడ్డిలో 1వ వార్డు సభ్యుడిగా ఉన్న నారాయణ కరోనాతో మృతి చెందడంతో అతడి కుమారుడు ఎన్.హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఇసురాళ్లపల్లిలో రెండవ వార్డుకు లక్ష్మీకాంతమ్మ, అబ్బేదొడ్డిలో రెండవ వార్డుకు నిట్టూరు ఖాశింపీరా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి బారాన్‌సాబ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీరెడ్డి తెలిపారు. చెర్లోపల్లి నాల్గవ వార్డుకు వై.ఓబుళరెడ్డి, బొబ్బూరి పుల్లన్న, లచ్చానుపల్లిలో ఏడవ వార్డుకు ఆంజనేయులు, సుగుణమ్మ, ధర్మాపురంలో నాల్గవ వార్డుకు మక్కెల అంజినయ్య, మండ్ల సూర్యనారాయణ పోటీలో ఉన్నారు.

యల్లనూరు: మండలంలోని పాతపల్లి 3వ వార్డు సభ్యుడిగా భూమిరెడ్డి కేశవర్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## సమరయోధులను స్మరించుకుందాం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన వీరులను స్మరించుకోవాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమరజవాన్లు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన యోధులను గౌరవిస్తూ సోమవారం అంజలి నగర్ పార్క్‌లో 'నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కసాపురం రోడ్డు నుండి పార్క్ వరకూ జాతీయ జెండాలను చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్క్‌లో 75 మొక్కలను నాటి నీరు పోశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, 2వ వార్డు కౌన్సిలర్ మెహరున్నీసా, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప, కౌన్సిలర్లు చాముండేశ్వరి, కుమారి, ప్రభాకర్, లింగన్న, వై.సుధాకర్, చాంద్‌బాషా, సుమోబాషా, నగేష్, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, తదిరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: దేశానికి స్వాతంత్ర్యానికి తీసుకొచ్చిన నాయకుల స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సిద్ధరాంపురం జెడ్పీ హైస్కూల్‌లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సిద్ధరాంపురం, పసులూరు సర్పంచులు కొండన్న, కల్పన, ప్రధానోపాధ్యాయురాలు నీరజ కుమార్ పాల్గొన్నారు.

### పరామర్శ

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జన చైతన్య నగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షెక్షావలి (చక్రి) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆలూరి రమణారెడ్డి సోమవారం ఆయన్ను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బుల్లే రాజా, శేషానందరెడ్డి, లక్ష్మీనారాయణ, నూర్ మహమ్మద్, హుసేన్, అంజి, పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: గుంతకల్లు మండలంలోని వైటీ చెరువు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆదినారాయణ సోమవారం గ్రామ శివారులోని పొలంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడ్ని గమనించిన స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



